ప్రజాశక్తి
శుక్రవారం 3 ఫిబ్రవరి 2023
5
అల్లూరి సీతారామరాజు



## జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు మత్స్యరాజు


మత్స్యరాజును అభినందిస్తున్న ప్రిన్సిపల్

ప్రజాశక్తి- పెదబయలు : జాతీయస్థాయి అండర్ -14 త్రోబాల్ పోటీలకు స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థి జి.మత్స్యరాజు ఎంపికయ్యాడు.గత నెల 27 నుంచి 29 వరకు కర్నూల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరచడం ద్వారా జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ షరా తెలిపారు. గిరిజన విద్యార్థి మత్స్యరాజులోని నైపుణ్యాన్ని వెలికితీసి, పదును పెట్టడంతో వ్యాయామ ఉపాధ్యాయుడు రాజు కృషి ఎంతో ఉందన్నారు. ఈ సందర్భంగా మత్స్యరాజుతోపాటు పిఇటి రాజును ప్రిన్సిపల్‌తోపాటు ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

## కాఫీ బకాయి వెంటనే చెల్లించాలి



ఆందోళన చేస్తున్న కాఫీ రైతులు

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: కాఫీ రైతులకు బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక గిరిజన సంఘం, కాఫీ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.సూర్యనారాయణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.పోతురాజు మాట్లాడుతూ మండలంలో 18 పంచాయతీల పరిధిలో సుమారు నాలుగు వేల మంది రైతులు కాఫీ సాగుచేస్తున్నారని, వారికి 2018 నుంచి 2022 వరకు కాఫీ ప్రోత్సాహక నిధులు రూ.4.62కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఐటిడిఎ పిఒ నిర్లక్ష్యం కారణంగా కాఫీ రైతుల ఖాతాల్లో బకాయి సొమ్ము జమ చేయడం లేదన్నారు. బకాయి సొమ్మును తక్షణం చెల్లించకపోతే, ఈ నెల 16న ఐటిడిఎ ముట్టడిస్తామని హెచ్చరించారు. కాఫీ రైతులు పాల్గొని ఆందోళన జయప్రదం చేయాలని కోరారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టే వరకూ ఉద్యమం



ఆందోళన చేస్తున్న గిరిజన ప్రజాసంఘాల నేతలు, గిరిజనులు

ప్రజాశక్తి -హుకుంపేట : అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టేవరకు ఉద్యమం ఆగదని అఖిలపక్ష గిరిజన సంఘం నేత కృష్ణారావు అన్నారు. గురువారం స్థానిక గిరిజన సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, హుకుంపేటలోదాదాపు 12మంది ఇళ్ల దుకాణాలకు గిరిజనేతరులే యజమానులుగా చెలామణి అవుతున్నారని ఆరోపించారు. మండలంలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు అఖిల పక్షంగా ఏర్పడి, గత 20 రోజులుగా 1/70, భూబదలాయింపు నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలపైనా ఎల్టీఆర్ కేసులు నమోదు చేయాలని, బినామీ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని, గిరిజన నిరుద్యోగ యువత ఉపాధికి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఇవ్వాలని, అక్రమ వలసలు అరికట్టాలని ఆందోళన చేస్తున్నా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. గురువారం దీనిపై అధికారులను కలిసి విన్నవించాలని నిర్ణయించినప్పటికీ వారు అందుబాటులో లేకపోవడంతో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణపై చర్చించామన్నారు. జిల్లా కలెక్టర్, తహశీల్దార్లకు ఇప్పటికే దీనిపై వినతిపత్రం అందజేశామని తగు చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నేతలు రంజిత్‌కుమార్, వైస్ ఎంపిపి కొండలరావు, రామారావు, విలక్షణరావు, బొడ్డ శ్యామ్, చంటి, శంకర్, కృష్ణారావు, విజయ్,పండు, తదితరులు కోరారు.

## విద్యార్థుల వరుస మరణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

**ఎస్‌టి కమిషన్ చైర్మన్ రవిబాబును కోరిన ప్రజాసంఘాల ఐక్యవేదిక**

**ఐటిడిఎ పిఒను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని వినతి**


ఎస్‌టి కమిషన్ చైర్మన్ రవిబాబుకు వినతిపత్రం ఇస్తున్న ప్రజాసంఘాల ఐక్యవేదిక

ప్రజాశకి పాడేరు : గిరిజన వ్యతిరేకి పాడేరు ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణను తక్షణమే ప్రభుత్వానికి సరెండర్ చేయాలని, గిరిజన ఆశ్రమాల్లో విద్యార్థుల వరస మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, ఆశ్రమంలో హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని కోరుతూ గురువారం పాడేరు వచ్చిన ఎస్‌టి కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబును ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రాధాకృష్ణ, కోకన్వీనర్ ప్రభుదాస్ మాట్లాడుతూ ఆశ్రమాల్లో హెల్త్ అసిస్టెంట్ లేకపోవడం వల్లనే విద్యార్థుల వరస మరణాలు జరుగుతున్నాయని వివరించారు, గిరిజన వ్యతిరేకి పాడేరు ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణకు గిరిజనులు, గిరిజన ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులంటే కనీస గౌరవం లేదని, గిరిజనులకు పట్ల చిన్నచూపు చూస్తూ, గిరిజనులకు హేళన చేస్తున్న పిఒను తక్షణమే ప్రభుత్వానికి సరెండర్ చేయడం ద్వారా ఈ ప్రాంతం నుండి సాగనంపాలని కోరారు. డిగ్రీ, ఇంటర్ ట్యూషన్, అడ్మిషన్, ఎగ్జామినేషన్ ఫీజులు ఐటిడిఎ చెల్లించాలని, పిఎంఆర్‌సి, కాఫీ గెస్ట్ హౌస్ గిరిజన ప్రజా సంఘాల సమావేశాలకు ఉచితంగా ఐటిడిఎ వసతి ఇవ్వాలని, ఆశ్రమల్లో అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలని, పెదబయలు మండల తహసీల్దార్ మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించాలని, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, మీడియా ప్రతినిధుల అనుమతిని నిరాకరిస్తూ జారీ చేసిన నోటీసులు తక్షణమే రద్దు చేయాలని రవిబాబుకు వినతి పత్రంలో కోరారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు, కంబిడి లతకూమరి, మువ్వల లక్ష్మణరావు, లక్ష్మీ పాల్గొన్నారు.

## జీవాలకు వ్యాక్సినేషన్



గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని కించాయి పుట్టు పంచాయతీ ధారాపల్లిలో 56 గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి కె.భాస్కర రావు తెలిపారు.

ఏజెన్సీలో జీవాలకు వ్యాక్సినేషన్ ప్రక్రియను గత నెల 28 నుంచి చేపడుతున్నామని, పెంపకందారులు దీన్ని సద్వినియోగం చేసకోవాలని కోరారు. 23,700 పారుడువ్యాధి టీకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పి.సత్యనారాయణ, సర్పంచ్ సీసా సుభాష్‌చంద్ర, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలకు జ్వరం

**ఆసుపత్రుల చుట్టూ విద్యార్థుల ప్రదక్షణలు**

**హెల్త్ అసిస్టెంట్ పోస్టుల రద్దుతో అవస్థలు**

**అధికారుల పర్యవేక్షణా లోపంతో పరిస్థితి అధ్వానం**

**జ్వరపీడితులను ఇళ్లకు పంపేస్తున్న హాస్టల్ యాజమాన్యం**


వైద్యం కోసం జిల్లా ఆసుపత్రిలో జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల నిర్వహణ అధ్వానంగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గిరిజన విద్యార్థులకు మంచి భోజనంతో పాటుగా సరైన ఆరోగ్య సంరక్షణ చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాలతో పలువురు విద్యార్థులు సీజనల్, విషజ్వరాలతోపాటు చర్మవ్యాధుల బారిన పడి ఆసుపత్రి పాలయ్యే దుస్థితి నెలకొందని అంటున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణా లోపం, తనిఖీల్లో గుర్తించిన సమస్యలపై సరైన చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాలే దీనికి కారణమని ఆరోపణలున్నాయి. ఇటీవల కాలంలో పలువురు విద్యార్థులు మృత్యువాత పడిన ఘటనలూ చోటుచేసుకున్నాయి. గురువారం పాడేరులోని జిల్లా కేంద్ర ఆసుపత్రికి .పట్టణంలోని తలారిసింగి జిటిడబ్ల్యూ ఆశ్రమ బాలుర పాఠశాలకు చెందిన 15 మందికి పైగా విద్యార్థులతో పాటు జి.మాడుగుల మండలం పెదలోచలి జిటిడబ్ల్యూ ఆశ్రమ బాలుర పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు ఆసుపత్రికి చేరారు. నిత్యం పదుల సంఖ్యలో ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు పదుల సంఖ్యలో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారంటే హాస్టళ్ల నిర్వహణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. హాస్టళ్ల నిర్వహణలోపాలు, సిబ్బంది నిర్లక్ష్యం విద్యార్థుల పాలిట శాప మవుతోంది. నిరంతర ఆరోగ్య పరీక్షలు, సకాలంలో వైద్య చికిత్సలు అందక పోవడం, ఉన్నతా ధికారుల పర్యవేక్షణ లేమి వెరసి విద్యార్థుల ప్రాణాల మీదకు తెస్తోంది. జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి మెరుగైన వైద్యానికి చర్యలు తీసుకోవాల్సిన హాస్టళ్ల నిర్వాహకులు. తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఫలితంగా కీలకమైన సమయంలో వైద్యం లభించక విద్యార్థులు మృత్యువాత పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పాడేరు ఏజెన్సీలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ హాస్టళ్లలో అపరిశుభ్ర వాతావరణం, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు లేకపోవడం కూడా అనారోగ్య సమస్యలకు కారణంగా చెప్పొచ్చు. ప్రభుత్వమిచ్చే మెస్ చార్జీలతో కనీస ప్రమాణాల మేరకు పౌష్టికాహార భోజనం పెట్టే పరిస్థితి లేక విద్యార్థులు రోగ నిరోధక శక్తి కోల్పోతున్నారు. రక్తహీనత తలెత్తుతోంది. నిత్యం విద్యార్థులు అనారోగ్య సమస్యలతో ఆసుపత్రులకు వెళ్తున్నారు. ఉండి విద్యార్థులు అనారోగ్యానికి గురైతే రాత్రీ..పగలు తేడా లేకుండా వైద్య సేవలు అందించే గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేసే హెల్త్ వాలంటీర్లను ప్రభుత్వం తొలగించింది. ప్రస్తుతం హాస్టళ్ల నిర్వహణతో పాటు ప్రత్యేకంగా విద్యార్థుల ఆరోగ్య సమస్యలపై హాస్టళ్ల నిర్వాహకులు దృష్టి సారించలేకపోవడంతో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి విషమిస్తోంది. పరిస్థితి చేయిదాటాక ఆసుపత్రికి తరలించడం వల్ల వీరి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు హాస్టళ్ల నిర్వహణ, అందులోని అనారోగ్య పరిస్థితులపై దృష్టిసారించి, పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

## పాత పెన్షన్ విధానం అమలు చేయాలి : యుటిఎఫ్


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి -డుంబ్రిగూడ: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల జీవిత భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సిపిఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని యుటిఎఫ్ చేపట్టే సంకల్ప దీక్షలో భాగంగా గురువారం మండల కేంద్రంలో సంబంధిత దీక్షల వాల్‌పోస్టర్లను యుటిఎఫ్ నేతలు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి చంద్రశేఖర్, ఎస్ కన్నయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గ్యారంటీ పెన్షన్ విధానం వల్ల సిపిఎస్ విధానంలో కంటే కొద్దిపాటి ప్రయోజనాలు అదనంగా చేర్చినప్పటికీ, అది ఉద్యోగ విరమణ అనంతరం భద్రత కలిగించేవిగా లేవన్నారు .పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మొదటి నుంచి పాత పెన్షన్ విధానం కొనసాగిస్తుండగా రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పంజాబ్ రాష్ట్రాలు పాత పెన్సన్ విధానాన్ని మళ్లీ పునరుద్ధరిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 3న యుటిఎఫ్ ఆధ్వర్యంలో కష్ణాజిల్లా గన్నవరం సమీపంలోని ధర్మస్థలి ప్రాంగణంలో చేపట్టే సంకల్ప దీక్ష సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కౌన్సిలర్లు, టి సుబ్బారావు, ఎస్ బాలకృష్ణ, మండల నాయకులు రామకృష్ణ, మల్లికార్జున పాల్గొన్నారు.

## పోలవరం నిర్వాసితులను గోదాట్లో ముంచుతారా?

**- కేంద్ర బడ్జెట్‌లో ప్రాజెక్టు, పునరావాసానికి నిధులు కేయించకపోవడం దారుణం**

**- మోడీ ముందు మోకరిల్లుతున్న సిఎం జగన్**

**- సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్**


మాట్లాడుతున్న సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

ప్రజాశక్తి-ఎటపాక

కేంద్ర బడ్జెట్లో పోలవరం ప్రాజెక్ట్‌కు, పునరావాసానికి నిధులు కేటాయించకుండా నిర్వాసితులను గోదాట్లో ముంచుతారా? అని సీపీఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ ప్రశ్నించారు. గురువారం ఎటపాకలో ఐ.పద్మ అధ్యక్షతన జరిగిన పార్టీ మండల కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్లో పోలవరం నిర్వాసితులకు పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. బడ్జెట్లో నిధులు కేటాయించకుండా నిర్వాసితులను ఎలా తరలిస్తారని, పోలవరం ప్రాజెక్టు ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. 25 మంది ఎంపీలు ఇస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, నిధులు రాబడతారని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్, పార్లమెంట్లో 22మంది లోకసభ సభ్యులు, 9 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నా ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రాష్ట్రానికి, పోలవరం నిర్వాసితులకు అన్యాయం జరుగుతున్నా ఎందుకు మౌనంగా ఉంటున్నారన్నారు. కేసులకు భయపడి రాష్ట్ర ప్రయోజనాలను మోడీకి తాకట్టు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి భారంగా మారిన పోలవరం నిర్మాణ వ్యయం అంతా కేంద్రమే భరించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితులను దగా చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమ ఎంపీలతో రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాబట్టేందుకు పార్లమెంట్ సాక్షిగా పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజాక్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి ఐవి, మండల కమిటీ సభ్యులు డేగల మాధవరావు, పులుసు బాలకృష్ణ పాల్గొన్నారు.

**ముంపు నిర్వాసితులకు నిధులు కేటాయించాలి**

**కూనవరం** : కేంద్ర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టు పునరావాసానికి నిధులు కేటాయించకుండా నిర్వాసిత ప్రజలకు ఎలా న్యాయం చేస్తారో బీజేపీ, వైసీపీ ప్రభుత్వాలు చెప్పాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే వతుంపు ప్రజలకు కొంతనైన న్యాయం జరిగేదన్నారు. కేంద్రం నుండి నిధులు రాబట్టడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సీతారామయ్య, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, రేగులపాడు సర్పంచ్ బొగ్గా రామారావు, కుటూరు సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, పెద్ద అర్కూర్ ఎంపీటీసీ ధర్ముల అమ్మాజీ, చూసిరేవుల గూడెం ఎంపీటీసీ కారం జయసుధ, మండల కమిటీ సభ్యులు బాబు బొర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి నివారణకు నిధులు కేటాయించాలి

**సిపిఎం ప్రజాప్రతినిధులు డిమాండ్**


వినతిపత్రం ఇస్తున్న సిపిఎం ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి, కూనవరం

మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువ నిధులు కేటాయించాలని సీపీఎంకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని, ప్రజలకు మంచినీటి సక్రమంగా అందించుటకు పంచాయితీల్లో నిధులు లేక ఇబ్బంది పడుతున్నా, ప్రభుత్వం కాలయాపన చేయడం తగదని పేర్కొన్నారు. తక్షణమే మంచినీటి సమస్యను పరిష్కరించడానికి ప్రతి గ్రామ పంచాయతీకి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రేగులపాడు సర్పంచ్ బొగ్గా రామారావు, కుటూరు సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, పెద్ద అర్కూర్ ఎంపీటీసీ ధర్ముల అమ్మాజీ, చూసిరేవుల గూడెం ఎంపీటీసీ కారం జయసుధ, మాజీ ఎంపీటీసీ మేకల నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ పాయం సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.


మృతుల ఫొటోలు పట్టుకొని నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబ సభ్యులు

### నష్టపరిహారం చెల్లించకపోవడంపై

## మృతుల కుటుంబాల నిరసన

**తక్షణమే ఇవ్వాలి : సిపిఎం నేత లోతా రామారావు**

ప్రజాశక్తి-రాజవొమ్మంగి


మండలంలోని లోదొడ్డి గ్రామంలో ఏడాది క్రితం విషపూరితమైన జీలుగు కల్లు తాగి మృతి చెందిన వారి కుటుంబాలకు నేటికీ నష్టపరిహారం చెల్లించకపోవడంపై మృతుల కుటుంబాలు గురువారం గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లోతా రామారావు మాట్లాడుతూ విష ప్రయోగమైన జీలుగు కల్లు తాగి ఏడాది క్రితం లోదొడ్డి గ్రామానికి చెందిన చెదల సుగ్రీవు, వేమ లోవరాజు, బూసరి సన్యాసిరావు, పొత్తూరు గంగరాజు, కె ఏసుబాబు మృతి చెందారని, ఈ విషాదకర సంఘటన జరిగి నేటికీ సంవత్సరం అవుతున్నా నేటికీ మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించకపోవడం దారుణమన్నారు. ఆనాడు ప్రజా ప్రతినిధులు, అధికారులు మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఐదు కుటుంబాలకు ప్రభుత్వం తప్పకుండా ఆర్థిక సహాయం అందజేస్తుందని గొప్పలు చెప్పారని గుర్తు చేశారు. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, జిల్లా అధికారులు, వైసిపి నాయకులు, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు మొసలి కన్నీరు కార్చి చేసిన వాగ్దానాలను అమలు చేయడం వారు విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. ఈ సంఘటన తర్వాత అనేక ప్రమాదాల్లో చనిపోయిన వారికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించిందని, కాని లోదొడ్డి గ్రామంలో మృతుల కుటుంబాలకు ఎందుకు న్యాయం చేయలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణం మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బుటారి రాజబాబు, సిపిఎం మండల నాయకులు కొత్తూరు సత్యనారాయణ జర్తా రాజబాబు, కె నాగరాజు, రాజుబాబు, మురళి, మృతుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఆదివాసీ బిడ్డకు ఎయు డాక్టరేట్

ప్రజాశక్తి-మారేడుమిల్లి


ఎయు విసి నుంచి పట్టా అందుకుంటున్న రాజ్‌కుమార్‌రెడ్డి

మారేడుమిల్లి మండలం లోతట్టు గ్రామమైన బొడ్లంక గ్రామానికి చెందిన గిరిజన యువకుడు పల్లాల రాజ్ కుమార్ రెడ్డి గురువారం ఆంధ్ర యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో నుండి డాక్టరేట్ అవార్డు అందుకున్నారు. ఎయు పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి చెందిన పరిశోదన విద్యార్థి రాజ్‌కుమార్‌రెడ్డి "పంచాయతీ రాజ్ సంస్థలో షెడ్యూల్ తెగల రాజకీయ భాగస్వామ్యం" తూర్పుగోదావరి జిల్లాలో ఒక కేస్ స్టడీ అంశాన్ని తీసుకొని రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి అరుణ్ కుమార్, ప్రొఫెసర్ పెటేటి ప్రేమానందం వారి సమక్షంలో పరిశోదన చేశారు. ముఖ్యంగా గిరిజన ప్రాంత ప్రజలు చదువుకున్న యువత రాజకీయాల పట్ల శ్రద్ధ చూపించి పంచాయితీ, గ్రామ అభివృద్ధి చెందాలంటే విద్యావంతులైన యువతకే సాధ్యమని అందులో పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల స్వార్థ రాజకీయ ప్రయోజనాలు, పంచాయితీ రాజ్ వ్యవస్థపై అవగాహన లోపం వలన అభివృద్ధి కుంట పడుతుందని, ఐటిడిఎ ద్వారా మారుమూల ప్రాంతాలకు న్యాయం జరగడం లేదని తెలిపారు. దానికి రాజకీయ దోపిడీయే కారణని తన పరిశోదనలో తేల్చారు. ఈ పరిశోదన నిమిత్తం ఆంధ్ర యూనివర్సిటీ డాక్టరేట్ తప్రధానం చేసింది. ఈ సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పివిజిడి ప్రసాద్ రెడ్డి పిహెచ్‌డి ప్రొసీడింగ్స్ ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగ అధిపతి ప్రొఫెసర్ పి.వీర్రాజు, ఆచార్యులు డాక్టర్ హరిబాబు, డాక్టర్ రత్నం రాజు, డాక్టర్ కె.సత్యనారాయణ, ఎయు ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు సమ రెడ్డి సింహాద్రి, యూనివర్సిటీ సూపరింటెండెంట్ దొండ సత్యనారాయణ పాల్గొన్నారు.


డొంకరాయి జలాశయం నుండి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

## డొంకరాయి జలాశయం నుంచి అదనంగా నీరు విడుదల

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు కాంప్లెక్స్ డొంకరాయి జలాశయం గేట్లు ద్వారా అదనంగా గోదావరి డెల్టాకు 1700 క్యూసెక్కులు నీటిని గురువారం నుంచి విడుదల చేస్తున్నామని ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ కేకేవి.ప్రశాంత్ కుమార్ వెల్లడించారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ సీలేరు, డొంకరాయి, పోల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి అనంతరం 4300 క్యూసెక్కులు గోదావరి డెల్టాకు విడుదల అవుతుందని తెలిపారు. గోదావరి డెల్టా నీటి అవసరాలు ఉన్నందున ఇరిగేషన్ అధికారులు కోరడంతో డొంకరాయి జలాశయం గేట్లు ద్వారా అదనంగా 1700 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామని, నీటి విడుదల వారం రోజులు పాటు కొనసాగుతుందని తెలిపారు. దీంతో ప్రస్తుతం గోదావరి డెల్టాకు మొత్తం 6000 క్యూసెక్కులు నీరు విడుదల కొనసాగుతుందన్నారు. జల విద్యుత్ కేంద్రాల్లో గ్రిడ్ ఆదేశాల మేరకే విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని చెప్పారు. డొంకరాయి పవర్ కెనాల్ గండి మరమ్మతు పనులు చివరి దశకు చేరుకున్నాయని, పవర్ కెనాల్‌కు ఇంజనీర్లుతో పెట్రోలింగ్ నిర్వహిస్తూ, నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. పోల్లూరు జల విద్యుత్ కేంద్రంలో గురువారం 3.135 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి కాగా డొంకరాయిలో .402 మిలియన్ యూనిట్లు, సీలేరులో .679 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు ఆయన చెప్పారు.

# పేదల వ్యతిరేక బడ్జెట్ : సిఐటియు

ప్రజాశక్తి -పాడేరు: కేంద్రబడ్జెట్, పేదలకు వ్యతిరేకంగా ఉందని సిఐటియు అల్లూరి జిల్లా కమిటీ విమర్శించింది. ఈ బడ్జెట్లో సామాన్యులు, కార్మిక కర్షకులకు కనీస ప్రాధాన్యత లేకుండా ధనవంతులకు అనుకూలంగా ఉందని సిఐటియు అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.చిన్నయ్యపడాల్, వి.ఉమామహేశ్వరరావు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర పథకాలైన ఐసిడిఎస్, మధ్యాహ్న భోజనం జాతీయ ఆరోగ్య మిషన్ వంటి ప్రభుత్వ స్కీములకు కేటాయింపులు పెంచలేదన్నారు. కార్మికులు డిమాండ్లకు పరిష్కారం చూపలేదన్నారు. కరోనా సమయంలో పేదలను కాపాడిన, మహాత్మాగాంధీ గ్రామీణ ప్రాంతంలో గిరిజనుల జీవనోపాధికి తోడ్పడే ఉపాధిహామీ పథకాలకు కేటాయింపులు పెంచకపోవడం సరికాదన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్నట్టు మరోసారి బడ్జెట్ ద్వారా బిజెపి నిరూపించుకుందన్నారు. గిరిజన యూనివర్సిటీకి నామమాత్రపు నిధులు కేటాయించి చేయి దులుపుకుందన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ కొనసాగిస్తున్నట్టు మోడీ ప్రభుత్వం ఈ బడ్జెట్ ద్వారా తేటతెల్లం చేసిందన్నారు. మరిన్ని ప్రజా వ్యతిరేక సంస్కరణలతో రాబోతున్నట్లుగా బడ్జెట్ తెలియజేస్తోందన్నారు. ఆంధ్రకు ప్రత్యేకహోదా, విశాఖ రైల్వే జోన్ను మొండిచేయి చూపడంతోపాటు రైల్వే, బ్యాంకింగ్, టూరిజం వంటి రంగాలు ప్రైవేటీకరణ చేస్తున్నట్టు తెలిపారన్నారు. నిరుద్యోగులు, రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులకు కేంద్ర బడ్జెట్లో తీవ్రమైన అన్యాయం చేశారని విమర్శించారు బడ్జెట్ను అంతా వ్యతిరేకించాలని, భవిష్యత్తులో కేంద్రంలో ఉన్న బిజెపి ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళనకు ప్రజానీకం సిద్ధం కావాలని కోరారు.


స్పర్శ అక్షర ఆకారంలో కూర్చున్న కస్తూర్బా విద్యార్థినులు

## కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో స్థానిక పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ పి రాంబాబు ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్టువ్యాధి పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ శరీరంపై స్పర్శ లేని మచ్చలతో పాటు చర్మంపై రాగిరంగు మచ్చలు వస్తే వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఒకవేళ కుష్టువ్యాధిగా నిర్ధారణ జరిగితే ప్రభుత్వపరంగా ఉచితంగా అందిస్తున్న మందులతో నయం చేయవచ్చని, ఈ వ్యాధుల పట్ల ప్రజల్లో ఉండే అపోహలు వీడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కుష్టు వ్యాధి పై అవగాహనకు పాఠశాల ఆవరణలో స్పర్శ అక్షర రూపంలో విద్యార్థులను కూర్చోబెట్టి అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.. కార్యక్రమంలో ఎంఎల్హెచ్పి బాబూరావు, హెల్త్ అసిస్టెంట్ ఎస్ స్వామి, ఎఎన్ఎంలు కిరణ్మయి, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 3 నుంచి ఓపెన్ స్కూలు పరీక్షలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఏప్రిల్ 3 నుంచి 17వ తేదీ వరకు ఓపెన్ స్కూలు పది, ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రాక్టికల్స్ ఏప్రిల్ 18 నుంచి 23వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్ష ఫీజును ఫిబ్రవరి 1 నుంచి మార్చి 7వ వరకు చెల్లించేందుకు గడువు ఉన్నట్టు తెలిపారు. అపరాధ రుసుము లేకుండా ఫిబ్రవరి 15 వరకు, అపరాధ రుసుముతో మార్చి 7 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

# కాలినడకన మారుమూల గ్రామాలకు..

- గిరిజన గ్రామాల్లో ఐటిడిఎ పిఒ సుడిగాలి పర్యటన
- మౌలిక సౌకర్యాల కల్పన, సమస్యల పరిష్కారానికి హామీ
- మొదటిసారి వచ్చిన పిఒకు గిరిజనులు ఘన స్వాగతం



గిరిజనులతో పాటు నేలపై కూర్చుని సమస్యలను వింటున్న పిఒ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్/జి.మాడుగుల : పాడేరు ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ గురువారం మారుమూల గిరిజన గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. జి.మాడుగుల, రావికమతం మండలాల సరిహద్దులో ఉన్న నేరేడుబంద, పెదగరువు, అజేయపురం, జీలుగులోని గ్రామాలకు పర్యటించారు. వాహనాలు వెళ్లలేని ఆయా గ్రామాలకు కొండమార్గంలో కాలినడకన ఎనిమిది కిలోమీటర్లు ప్రయాణించి గ్రామాలకు చేరుకుని గిరిజన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హోదాను పక్కనపెట్టి గిరిజనులతో పాటు నేలపై కూర్చుని వారి సమస్యలను ఓపికగా విని నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. మొట్టమొదటి సారిగా ఐటిడిఎ పిఒ తమ గ్రామంలో పర్యటించడంతో గిరిజనులు ఘనంగా స్వాగతం పలికారు. నేరేడుబంద గ్రామానికి గ్రావిటీ పథకం మంజూరు చేస్తామని చెప్పారు. పెదగరువు గ్రామంలో ఆటవీ హక్కుపత్రాలు, వంపిణీ భూ సమస్యలను గ్రామస్తులు పిఒ దృష్టికి తేవడంతో వెంటనే పరిష్కరించాలని రావికమతం తాహశీల్దారును ఆదేశించారు. నేరేడుబంద పాఠశాలకు విద్యార్థులు తక్కువగా హాజరవుతున్నారని, బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని గిరిజన సంక్షేమాధికారిని ఆదేశించారు. పాఠశాలకు రేకుల షెడ్డు నిర్మాణానికి రూ.లక్ష మంజూరు చేస్తామని చెప్పారు. జీలుగు గ్రామంలో ఏడు గిరిజన కుటుంబాలకు ఇళ్ల నిర్మాణానికి ఒక్కొక్క కుటుంబానికి రూ.50వేలు మంజూరు చేసారు. గ్రామానికి విద్యుత్ సదుపాయం, ఉపాధిపనులు కల్పించాలని గ్రామస్తులు కోరగా తగిన చర్యలు చేపట్టాలని రావికమతం ఎంపిడిఒను ఆదేశించారు. గొంగిపేట గ్రామానికి జియోటవర్ మంజూరు చేశారని టవర్ నిర్మాణం ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నేరేడుబంద గ్రామంలో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి బ్యాంకు రుణాలు అందించాలని వెలుగు సిబ్బందిని ఆదేశించారు. అజేయపురం గ్రామంలో లోన్ రికవరీ సమస్యలను పరిష్కరించాలని ఎపిఎంకు సూచించారు. రైతులకు జీడి మామిడి మొక్కలు పంపిణీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బొద్దు మామిడి గ్రామంలో మొబైల్ ఆధార్ క్యాంపు ఏర్పాటు చేయాలని ఎంపిడిఒకు సూచించారు.కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకన్న బాబు, తాహశీల్దార్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.


కాలి నడకన గిరి గ్రామాలకు చేరుకుంటున్న పిఒ గోపాలకృష్ణ

# 'పది'లో శతశాతం ఫలితాలే లక్ష్యం

### జిల్లా విద్యాశాఖాధికారి రమేష్


విద్యార్థితో మాట్లాడుతున్న డిఇఒ రమేష్

ప్రజాశక్తి- పెదబయలు : పదో తరగతిలో శతశాతం ఫలితాలే లక్ష్యంగా ప్రణాళికను రూపొందించి పక్కాగా అమలు చేయాలని హెచ్ఎంలను డిఇఒ రమేష్ సూచించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు రికార్డులను పరిశీలించి, తర్వాత పదవతరగతి గదికి వెళ్లి విద్యార్థుల నైపుణ్యాలను స్వయంగా పరిశీలించారు. గణితం, అంగ్లం సబ్జెక్టులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుల డైలీ లెసన్ ప్లాన్, ఎఫ్ఎ 1,2 ఎస్ఎ 1 పరీక్ష పత్రాలు, విద్యార్థులు రాసిన జవాబుల పత్రంలో వారికి వచ్చిన మార్కులను పిఎంఆర్తో సరిపోల్చారు. ముఖ్యంగా పదవతరగతి విద్యార్థుల మార్కుల గ్రేడింగ్స్ పరిశీలించారు. విద్యార్థులు చేతిరాత నోట్బుక్స్ పరిశీలించారు. కొద్దిసేపు ఉపాధ్యాయుని అవతారమెత్తి, విద్యార్థుల విషయ పరిజ్ఞానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణవేణి పాల్గొన్నారు

## నేరాలు ఘోరాలు

### మహిళపై కత్తితో దాడి

- పురుగుల మందు తాగి నిందితుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట మండలం కంచుగుమ్మల గ్రామంలో గురువారం ఉదయం ఐదు గంటల సమయంలో గేదెల కుమారి అనే మహిళపై బిజిపాలెం గ్రామానికి చెందిన వూడి రమణ అనే వ్యక్తి దాడి చేసినట్లు రోలుగుంట ఎస్ఐ నాగకార్తీక్ తెలిపారు. వేరే కేసులో జైలుకు వెళ్లి ఇటీవల విడుదలై వచ్చిన రమణ, గురువారం కంచుగుమ్మల గ్రామానికి వచ్చి ఉదయం 5 గంటల సమయంలో తన కోరిక తీర్చాలని కుమారిని ఒత్తిడి చేయగా, ఇష్టం లేక ఆమె వ్యతిరేకించడంతో కత్తితో కుడి మెడ మీద దాడి చేసి గాయపరిచాడని దీంతో బాధితురాలిని కెజిహెచ్కు తరలించినట్లు తెలిపారు. కుమారిపై దాడి అనంతరం రమణ విషం తీసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. అయితే ఇద్దరికి ప్రాణాప్రాయం తప్పిందన్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుమారి వద్ద జిల్లా ఎస్పి ఎంఎస్.గౌతమిశాలి వెళ్లి సంఘటనను సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.


గ్రామ సభలో మాట్లాడుతున్న తహశీల్దార్ అప్పలస్వామి

## చకచకా సమగ్ర భూ రీసర్వే

ప్రజాశక్తి -జి. మాడుగుల : మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో సమగ్ర భూ రీసర్వే చకచకా సాగుతోందని తహశీల్దార్ కె.అప్పలస్వామి తెలిపారు. గురువార మండలంలోని పెదలోచలి, వంతాల పంచాయతీల్లోని పాచిలి, చోలంపుట్టు గ్రామాల్లో జరుగుతున్న భూ రీసర్వేను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతూ భూ రీసర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. భూ రీసర్వే ద్వారా భూవివాదాలు పరిష్కారమౌతాయన్నారు. మండలంలో ఇప్పటివరకు 12 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తయిందని తహశీల్దార్ అప్పలస్వామి తెలిపారు.

## పూర్తిస్థాయి స్టీల్ ఉత్పత్తి చేయాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్ప్లాంట్లో పూర్తిస్థాయి ఉత్పత్తి చేయాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కొత్తగా సిజిఎం (వర్క్స్) బాధ్యతలు చేపట్టిన బికె మొహంతిని ఆయన కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ, ప్లాంట్లో పూర్తిస్థాయి ఉత్పత్తి చేయడానికి కార్మిక వర్గం సిద్ధంగా ఉందన్నారు. బిఎఫ్-3ని తక్షణం ప్రారంభించడం ద్వారా పూర్తిస్థాయి ఉత్పత్తితో పాటు ఆర్థికంగా అభివృద్ధి ఉంటుందని వివరించారు. ఆ దిశగా యాజమాన్యం చర్యలు చేపట్టాలని కోరారు.

స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, ఉత్పత్తిలో కార్మికులు మరింత అంకితభావంతో పనిచేయడం కోసం నూతన వేతనాలను అమలు చేయడంలో యాజమాన్య వైఖరిని మార్చుకోవాలని కోరారు. ఉత్పత్తికి అనుగుణంగా కార్మికులకు ప్రోత్సాహకాలను అందించడం కోసం కృషి జరగాలన్నారు. వీటిని యాజమాన్యం పరిష్కరించే దిశగా ప్రయత్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు బి.అప్పారావు, శ్రీనివాసరాజు, గంగాధర్, టివికె.రాజు, బిఎన్.మధుసూదన్, సత్యనారాయణ, మురళి, డిఎస్ఆర్సి.మూర్తి, మొహిద్దీన్, దుర్గాప్రసాద్, ముత్యాలనాయుడు, దేముడు నాయుడు, శ్రీనివాసులురెడ్డి, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

## పేదరిక రహిత రాష్ట్రమే లక్ష్యం

ప్రజాశక్తి-కొయ్యూరు

పేదరిక రహితంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని తయారు చేసేందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని గోపవరం, లింగాపురం, రామన్నపాలెం, చిట్టెంపాడు గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం ఆమె చేపట్టారు. 285 గడపలను సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తారు హామీ ఇచ్చారు. కొన్నింటిని అక్కడే పరిష్కారానికి చొరవ చూపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పేదవాడు ప్రభుత్వ ఫలాలు పొందినప్పుడే వారు ఆర్థికంగా పురోభివృద్ధి సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి వారా నూకరాజు, ఎంపీపీ బడుగు రమేష్ బాబు, వైస్ ఎంపీపీలు వెంకటరమణ, అంబటి నూకాలమ్మ, ఉల్లి నరసమ్మ, నెమలి నూకాలమ్మ, ఎంపీటీసీ బిడిజన అప్పారావు, నాయకులు లక్ష్మణరావు, ఉల్లి రామ్మూర్తి, జల్లి బాబులు, జైతి రాజులమ్మ, అచ్యుత్, గాడి నాగమణి, గజ్జయ్య దొర, రేగటి ముసలి నాయుడు, పొట్టిక భవాని, రావుల వెంకటలక్ష్మి, రాజాకుమారి, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## జెన్కో ఉన్నతాధికారులను కలిసిన కార్మిక నాయకులు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ఏపీ జెన్కో1104 కార్మిక సంఘం రీజనల్ అధ్యక్షులు వై.సత్తిబాబు, బ్రాంచ్ కార్యదర్శి జి. శివప్రసాద్ ఆధ్వర్యాన కార్మిక నాయకులు జెన్కో ఉన్నతాధికారులను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఈ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్, ఈఈలు లక్ష్మీనారాయణ, ప్రభాకర్కు యూనియన్ లోగోతో ముద్రించిన 2023 డైరీ, కేలండర్లను అందజేశారు. సివిల్ విభాగంలో ఈఈగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రభాకరుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఏపీ జెన్కో కార్మికులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జెఎఒ జోగారావు, యూనియన్ కోశాధికారి పాండు, కార్యవర్గ సభ్యులు ఎస్.నాగేష్, కే.భవాని శంకర్, వై.నాగరాజు, అడపా శ్రీను, కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు డి.లక్ష్మణరావు, కార్యదర్శి ఆర్.నాని, కాంట్రాక్ట్ కార్మికులు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## 8 నుంచి వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని కొండ గోకిరి గ్రామంలో ఈనెల 8 నుండి 20వ తేదీ వరకు లోకుల గాంధీ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కొండగోకిరి దత్తపుత్రుడు మురళీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్లో జిల్లా నుండి ఎన్ని జట్లు అయినా పాల్గొనవచ్చునని, ఎంట్రీ ఫీజు రూ.800 అని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.30వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9121374302, 9491432841, 9381169756 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## శ్రమదానంతో కంచె ఏర్పాటు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని చిట్టింపాడు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల ఆవరణలోని కూరగాయల మొక్కలు, పూల మొక్కలు సంరక్షణకు చుట్టూ కంచె వేయాలని ఉపాధ్యాయులు నిర్ణయించారు. అనుకున్నట్లే ఉపాధ్యాయులు ఇనుప స్తంభాలను మోసుకురాగా, విద్యార్థులు గోతులు తవ్వి వాటిలో స్తంభాలను అమర్చడం, ఇనుప కంచె చుట్టడం వంటి పనులు చేసి కంచె నిర్మాణం చేశారు.

## గ్రామ వాలంటీరు పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలంలో ఖాళీగా ఉన్న మూడు గ్రామ వాలంటీరు పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీవో మేరీ రోజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మంప పంచాయతీలో మూడు ఖాళీలు, కొయ్యూరులో రెండు, బకులూరు పంచాయితీలో ఒకటి ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. స్థానికంగా నివాసముంటున్న అభ్యర్థులు ఈనెల 3 నుంచి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 8న ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## కోడి పుంజుల వేలం

ప్రజాశక్తి-చింతూరు : ఇటీవల కోడి పందేల్లో పట్టుకున్న కోడి పుంజులకు చింతూరు పోలీస్ స్టేషన్లో గురువారం వేలంపాట నిర్వహించారు. సిఐ ఎం అప్పలనాయుడు, ఎస్ఐ యాదగిరి మధ్యవర్తుల సమక్షంలో జరిగిన వేలంపాటలో 15 కోడిపుంజులను పాట దారులు రూ.24,900 పాడుకున్నారు. ఈ సమాచారాన్ని ఎస్సై యాదగిరి విలేకరులకు తెలిపారు.

# సమరయాత్రకు అపూర్వ స్పందన

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు విశాఖ, అనకాపల్లిల్లో సభలు
భారీగా తరలొచ్చిన యువత
మోసకారి పాలకులకు బుద్ధి చెప్పాలని నేతల పిలుపు


విశాఖ సభలో మాట్లాడుతున్న చలసాని, చిత్రంలో నర్సింగరావు, తదితరులు

**ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం విద్యార్థి, యువజన సంఘాలు హిందూపురం నుంచి ఇచ్ఛావరం వరకూ చేపట్టిన సమరయాత్ర గురువారం అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో పర్యటించింది. అనకాపల్లిలోని ఎన్టిఆర్ స్టేడియం వద్ద, విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభలు జరిగాయి. వందలాది మంది విద్యార్థులు, యువతీ యువకులు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి తరలొచ్చి ఆయాచోట్ల పూలు జల్లి యాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. ఆయా సభల్లో నేతలు మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఇస్తామని రాష్ట్ర ప్రజలను మోసగించిన పాలకులకు రానున్న కాలంలో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. హోదాపైనే యువత భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు.**

**కలెక్టరేట్ (విశాఖపట్నం) :** విశాఖ నగరంలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభ జరిగింది. డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ఎన్.రాజు అధ్యక్షత వహించారు. ఈ సభలో ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మోసాన్ని ప్రశ్నించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిద్రపోతోందని మండిపడ్డారు. అందుకే ప్రత్యేక హోదా సాధన, విభజన హామీల అమలు కోసం, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల ప్రత్యేక ప్యాకేజీల కోసం పోరాటం చేపట్టామని తెలిపారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ గుంటూరు, విజయవాడ, విజయనగరం పట్టణాల కంటే విశాఖపట్నం చిన్నదైనప్పటికీ వాటన్నింటినీ మించి మహానగరంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వ రంగ సంస్థలు కారణమని తెలిపారు. స్టీల్ప్లాంట్ సహా ప్రభుత్వ రంగ సంస్థలు విశాఖకు రావడానికి ఆనాడు విద్యార్థులు చేసిన పోరాటాలే కారణమని చెప్పారు. స్టీల్ప్లాంట్ సాధన కోసం 32 మంది ఆత్మ బలిదానం చేశారని గుర్తు చేశారు. అటువంటి స్టీల్ప్లాంట్ను ఇప్పుడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమ్మివేసేందుకు చూస్తోందన్నారు. రెండేళ్లుగా తాము చేసిన పోరాటం ఫలితంగా స్టీల్ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిందని తెలిపారు. ప్రత్యేక హోదా వస్తే రక్షణ రంగంలో పది వేల ఉద్యోగాలు వస్తాయని, స్టీల్ప్లాంట్, రైల్వే వగైరా వాటిలో వేల సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. విశాఖ కేంద్రంగా ఏర్పాటు కావలసిన రైల్వే జోన్ను ఇంతవరకూ ఇవ్వలేదన్నారు. దుర్మార్గపు బిజెపి ప్రభుత్వాన్ని పోరాటాల ద్వారా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ విశాఖ స్టీల్ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టాలని, విశాఖకు రైల్వే జోన్ ఇవ్వాలని, సెంట్రల్ యూనివర్సిటీలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం పిడిఎఫ్ తరపున ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్, కార్యదర్శి అశోక్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, తదితరులు మాట్లాడారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ప్రొఫెసర్ జాన్, ప్రొఫెసర్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

**అనకాపల్లి :** అనకాపల్లి పట్టణంలోని ఎన్టిఆర్ స్టేడియం వద్ద బహిరంగ సభ జరిగింది. చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికైనా ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకుంటే పెద్ద ఎత్తున నిరుద్యోగ యువత, విద్యార్థులు ఉద్యమిస్తారని హెచ్చరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ విద్యార్థి, యువత ఉపాధి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని పెట్రోలియం, గిరిజన యూనివర్సిటీలకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్నాథ్, ఎంపీ సత్యవతి ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లిలో విద్యాలయాల్లో తగు సదుపాయాలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఎస్వి.నాయుడు, ఎస్.రమణ, వియ్యపు రాజు అధ్యక్షతన బహిరంగ సభ జరగ్గా విద్యార్థి, యువజన సంఘాల నాయకులతోపాటు అల్లూరి సీతారామరాజు వారసులు సత్యనారాయణ రాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

**ఉక్కునగరం :** సమరయాత్ర బృందం కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న ఉక్కు పరిరక్షణ దీక్షా శిబిరాన్ని సందర్శించింది. 721 రోజులుగా స్టీల్ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం జరుగుతుంటే మోడీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. స్టీల్ప్లాంట్ ఉద్యమ నాయకులు కూడా బస్సు యాత్ర నిర్వహించాలని చలసాని శ్రీనివాస్ సూచించారు.

**సమరయాత్రను అడ్డుకున్న ఎయు యాజమాన్యం**

**ఎంవిపి.కాలనీ :** సమరయాత్ర ఆంధ్ర యూనివర్సిటీలోకి ప్రవేశించకుండా నిరంకుశ పద్ధతిలో ఎయు యాజమాన్యం అడ్డుకుంది. దీంతో వర్సిటీ ముఖ ద్వారం ముందే యాత్రా బృందం నిరసనకు దిగింది. ఈ సందర్భంగా చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల్లోకి వెళ్లిన తమ యాత్రను ఎయులోకి అనుమతించకపోవడం దుర్మార్గమన్నారు. వీసీ ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు, విశాఖ స్టీల్ప్లాంట్ పరిరక్షణకు వ్యతిరేకమా, అనుకూలమా ? అన్నది వెంటనే చెప్పాలన్నారు. హైకోర్టు ఆర్డర్ చూపించినా అనుమతి ఇవ్వకపోవడంతో యూనివర్సిటీ యాజమాన్యం తీరుపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.


యాత్రా బృందంపై పూలు జల్లి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు


మాట్లాడుతున్న భవాని

## ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం వేటుకూరు పంచాయతీ పరిధి మామిడి కోట గ్రామంలో ఉపాధి హామీ పథకంపై ఎంపీడీవో వీర కిషోర్ ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు ముఖ్య అతిథులుగా డ్వామా డిప్యూటీ కమిషనర్ సి భవాని, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్ రామన్, రంపచోడవరం పిహెచ్ం కే చిట్టిబాబు హాజరయ్యారు. డ్వామా డిప్యూటీ కమిషనర్ సి భవాని మాట్లాడుతూ గ్రామంలోని రైతులందరూ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను ఉపయోగించుకుని తమ పోడు భూములలో పంటలను వేసుకుని సాగు చేసుకోవాలని సూచించారు. ఉద్యానవన మొక్కల పెంపకానికి సంబంధించి రైతులకు వివరించారు. రబ్బరు, జాఫ్రా మొక్కల పెంపకంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక వనరులను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని రైతులకు కోరారు. గ్రామంలోని గ్రామస్తులు పడుతున్న పలు ఇబ్బందులను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి ఏపీఓ రెడ్డి బాబు, రంపచోడవరం ఏపీఓ సాయిబాబా, వై రామవరం ఏపీవో ప్రకాష్ వేటుకూరు, పంచాయతీ కార్యదర్శి వంశీ రాఘవ, సర్పంచ్ ఈతపల్లి మల్లీశ్వరి, ఉప సర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.


సీతమ్మకు నిత్యావసర సరుకులు అందజేసిన సిఆర్పిఎఫ్ సిబ్బంది

## మావోయిస్టు తల్లికి నిత్యావసరాల అందజేత

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం దుప్పిలి వాడ పంచాయతీ కొమ్ములవాడ గ్రామానికి చెందిన మావోయిస్టు పార్టీ ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు కాకూరు పండన్న అలియాస్ జగన్ తల్లి సీతమ్మని గురువారం పోలీసులు పరామర్శించారు. సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ కమాండెంట్ సతీష్ కుమార్, జీకే వీధి సిఐ అశోక్ కుమార్ గ్రామానికి వెళ్లి ఆమెకు నిత్యవసర సరుకులు, రగ్గులు పంపిణీ చేసి, వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా జగన్ తల్లి సీతమ్మ మాట్లాడుతూ చివరి క్షణంలో కుమారుడిని చూడాలని ఉందని పోలీసులు ముందు ప్రాధాయపడి కన్నీరు పర్యావంతమైంది. దీనికి స్పందించిన వారు తల్లి సీతమ్మ వద్దకు ఆమె కుమారుడు కాకూరు పండన్న అలియాస్ జగన్ రావడానికి తాము పూర్తిగా సహకరిస్తామని తెలిపారు. జగన్ తల్లి సమాచారం తెలుసుకుని లొంగిపోవడానికి సహకరించాలని, చివరి క్షణంలో తల్లి బాగోగులు చూసుకోవాలని పోలీసులు సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, స్థానిక ఎస్సై రామకృష్ణ, వైద్య అధికారి సౌమ్య తదితరులు పాల్గొన్నారు.